Eenadu

Dt 30/03/18

# 8 నిమిషాలకో మెట్రో!

- నాగోల్ - అమీర్‌పేట మధ్య ఫ్రీక్వెన్సీ పెంపు
- వచ్చే నెల నుంచి అమలు



ఈనాడు, హైదరాబాద్

మెట్రోరైళ్ల వేగం పెంచడంతోపాటూ వేచి చూసే సమయాన్ని తగ్గించేందుకు ఫ్రీక్వెన్సీని పెంచాలనే సర్కారు ఆదేశాలు ఏప్రిల్ నుంచి అమలు కానున్నాయి. ఇందుకు ఎల్ అండ్ టీ మెట్రోరైలు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. కచ్చితమైన తేదీని త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఎన్ని నిమిషాలకు ఒక రైలు నడపాలనే దానిపై సంస్థ కసరత్తు చేస్తోంది. ఐదు నిమిషాలకు ఒకటి అనే డిమాండ్‌పై తర్జనభర్జన పడుతోంది. ప్రస్తుతం రెండు కారిడార్లలో కలిపి రోజుకు సగటున 60 వేల మంది ప్రయాణిస్తున్నారని. ఎనిమిది నిమిషాలకో రైలు సరిపోతుందనే ఆలోచనలో ఉంది. ప్రస్తుతం మియాపూర్ నుంచి అమీర్‌పేట వరకు మెట్రో ఇలానే నడుస్తోంది. ఏప్రిల్ తర్వాత

...మిగతా 4లో

## 8 నిమిషాలకో మెట్రో!

(మొదటి పేజీ తరువాయి) ఈ మార్గంలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చు. వేగం పెరుగుతుంది కాబట్టి ఇప్పుడు పడుతున్న 22 నిమిషాల సమయం 15-18కు తగ్గే అవకాశం ఉంది. నాగోల్ నుంచి అమీర్‌పేట మధ్య ప్రయాణికులకు ఊరట లభించబోతోంది. ప్రస్తుతం ఈ మార్గంలో 15 నిమిషాలకో రైలు నడుస్తోంది. 40 నిమిషాల సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో నాలుగు నెలలుగా ప్రయాణికులు ఒకింత అసంతృప్తిగా ఉన్నారు. ఏప్రిల్ నుంచి ఈ మార్గంలో ప్రతి 8 నిమిషాలకు ఒక మెట్రో నడిపేలా యోచిస్తున్నారు. పూర్తిగా కమ్యూనికేషన్ బేస్ట్ కంట్రోల్ టెక్నాలజీ(సీబీటీసీ)తో నడపడం ద్వారా వేగం పెంచి 25 నిమిషాల్లోనే గమ్యస్థానం చేరుస్తారు. ఒకవేళ రద్దీ నెలకొంటే ఆ మేరకు మరింత వ్యవధి తగ్గించి 5 నిమిషాలకు ఒకటి నడిపే ఆలోచన ఉందంటున్నాయి మెట్రో వర్గాలు.

### ఐపీఎల్ మ్యాచ్‌లకు రాత్రి 12.30 గంటల వరకు

ఐపీఎల్ కొత్త సీజన్ రాబోతుంది. మ్యాచ్‌లు జరిగే రోజు మెట్రో సర్వీస్‌లను అర్ధరాత్రి 12.30 గంటల వరకు ఎల్ అండ్‌టీ నడపబోతుంది. హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం ఏప్రిల్ 9 నుంచి ట్వంటీ20 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఏప్రిల్ 9, 12, 22, 26, మే 5, 7, 19వ తేదీల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు... రాజస్థాన్, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, ముంబయి, పంజాబ్, బెంగళూరు జట్లతో తలపడనుంది. ఏప్రిల్ 22 తేదీ మినహా మిగిలిన మ్యాచులన్నీ రాత్రి 8 గంటలకు ప్రారంభం కానున్నాయి. మ్యాచ్ ముగిసే సరికి రాత్రి 12 గంటలవుతుంది. మ్యాచ్ తిలకించేందుకు వచ్చిన ప్రేక్షకులను గమ్యస్థానం చేర్చేందుకు మెట్రో సర్వీసు వేళలను పొడిగించనున్నారు. ప్రస్తుతం సర్వీసులు రాత్రి 10 గంటల వరకే నడుస్తున్నాయి. చివరి మెట్రో ఉప్పల్, మియాపూర్ డిపోకు చేరుకునే క్రమంలో కొన్ని మార్గాల్లో రాత్రి 11.30 గంటల వరకూ అందుబాటులో ఉంటున్నాయి. ఉప్పల్ స్టేడియం సమీపంలోనే రహదారిపై మెట్రో స్టేషన్ ఉండటంతో మెట్రో సర్వీసుల వేళలు పొడిగించడం ద్వారా క్రికెట్ ప్రేక్షకులకు సౌకర్యంగా ఉండనుంది.